## క్లుప్తంగా

### విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలి



నీటి బాటిళ్లు అందజేస్తున్న జడ్జి రాజ్యలక్ష్మి

హిందూపురం అర్బన్: తల్లిదండ్రులు విభిన్న ప్రతిభావంతుల పిల్లల పట్ల ప్రేమతో వ్యవహరించడంతో పాటు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జూనియర్ సివిల్‌జడ్జి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎంజీఎం మైదాన ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో శనివారం జరిగిన జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. జడ్జి మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతుల్లో ప్రతిభ దాగి ఉంటుందని, దాన్ని గుర్తించి వెలికితీయాలన్నారు. అనంతరం విద్యార్థులకు నీటి బాటిళ్లు అందజేశారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రి అందజేస్తానని ఏపీపీ ఇందాద్ తెలిపారు. ఏజీపీ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ గంగప్ప, వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ బైసాని రాంప్రసాద్, న్యాయవాదులు సుదర్శన్, నారాయణగౌడ్, సంతోషికుమారి, శారద, ఆశ, లలిత పాల్గొన్నారు.

### వాల్మీకి ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న ఆగ్రో చైర్మన్ నవీన్‌నిశ్చల్

హిందూపురం: పట్టణంలో నిర్మిస్తున్న వాల్మీకి మహర్షి ఆలయానికి, వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏపీ ఆగ్రో చైర్మన్ నవీన్‌నిశ్చల్ రూ.2 లక్షల విరాళాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి సముదాయ ప్రజలు ఐక్యంగా ఆలయ నిర్మాణం చేపట్టి జయప్రదం చేయాలన్నారు. కమిటీ సభ్యులు రామకృష్ణప్ప, మూర్తి, సాయి, దేవరాజు, విజయ్‌కుమార్, కొండప్ప, హనుమంతు వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, ఆనంద్, రామాంజి పాల్గొన్నారు.

### ఆలయానికి విరాళం




విరాళం అందజేస్తున్న శేషాద్రిరెడ్డి తల్లి ఓబులమ్మ

గోరంట్ల: స్థానిక ధామర ఒడ్డు సమీపంలో వెలసిన అయ్యప్ప ఆలయంలో అన్నదానం కోసం బూడిదగడ్డపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ శేషాద్రిరెడ్డి 1,00,116 విరాళం ప్రకటించారు. విరాళ మొత్తంను శేషాద్రిరెడ్డి తల్లి ఓబులమ్మ ఆలయ గురుస్వామితో పాటు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. బాలరంగయ్య, రామకృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, రాజశేఖరరెడ్డి, గంగాధర్, విష్ణువర్ధనరెడ్డి పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మృతి



నారాయణరెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మాలగుండ్ల రవీంద్ర



ఆర్.నారాయణ రెడ్డి(ఫైల్)

పరిగి: మండలంలోని శాసనకోట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఆర్.నారాయణరెడ్డి(77) గుండె పోటుతో మృతి చెందారు. సర్పంచ్ మాలతి కుటుంబసభ్యుడైన నారాయణరెడ్డి శనివారం ఉదయం ఈపాస్ మిషన్ ఆన్ చేయడానికి ఎఫ్‌పీ షాపు తెరవడానికి వెళ్లి కుప్పకూలాడు.108 సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఫోన్‌లో నారాయణరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే సోదరుడు మాలగుండ్ల రవీంద్ర శాసనకోటకు విచ్చేసి నారాయణరెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారాయణరెడ్డి మేనల్లుడు నరసింహారెడ్డిని, సర్పంచ్ మాలతిని ఓదార్చారు. నలభై ఏళ్లుగా శాసనకోట డీలర్‌గా వ్యవహరించిన నారాయణరెడ్డి వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం తరువాత పార్టీ బలోపేతానికి తన వంతుగా కృషి చేశారు. నారాయణరెడ్డికి భార్య లక్ష్మీదేవి, కుమార్తె జలజాక్షి ఉన్నారు. లక్ష్మీదేవి గతంలో శాసనకోట సర్పంచ్‌గా సేవలందించారు.

### స్పందన కార్యక్రమాన్ని వినియోగించుకోండి

అమరాపురం: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సోమవారం ఉదయం 9–30 గంటల నుంచి మధ్యాహ్నం 1–30 గంటల వరకు డివిజనల్ స్థాయి స్పందన కార్యక్రమాన్ని పెనుగొండ సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ కలెక్టర్‌తో పాటు డివిజనల్ స్థాయి అధికారులు, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు. మండల ప్రజలు తమ సమస్యలపై స్పందనలో తెలియజేయాలని ఆయన కోరారు.

# 18 ఏళ్లు నిండితే చేతిలో వజ్రాయుధం

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే వజ్రాయుధం. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో శనివారం ఊరూ వాడా ర్యాలీలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. అధికారులు హాజరై ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు.





లేపాక్షిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిర: స్వీప్ కార్యక్రమంలో భాగంగా మడకశిరలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ముర్షావలి మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన విద్యార్థులందరూ తప్పనిసరిగా ఓటర్లుగా చేరాలని కోరారు. విద్యార్థులు ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంఈఓలు భాస్కర్, నరసింహమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు పాల్గొన్నారు.

గోరంట్ల: స్థానిక ఎస్‌పీవీయం డిగ్రీ కళాశాలలో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి శేఖర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రజల చేతిలో వజ్రాయుధమన్నారు. నచ్చిన నాయకుడు, నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థుతో ప్రతిజ్ఞచేయించారు.

**నేడు స్పెషల్ డ్రైవ్**

అగళి: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జమానుల్లాఖాన్ సూచించారు. గుప్త కాలేజ్ లో ఓటుహక్కు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓటరు నమోదుకు ఆదివారం స్పెషల్ డ్రైవ్ ఉంటుందని తెలియజేశారు. ఎంఈఓ భాస్కర్,డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ రఘురాం పాల్గొన్నారు.

లేపాక్షి: తహసీల్దార్ బాబు ఆధ్వర్యంలో లేపాక్షిలో ఓటు హక్కు అవగాహనపై ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు. ఈఓఆర్డీ శివన్న, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

చిలమత్తూరు: ఓటు హక్కు ద్వారా దేశ భవిష్యత్ నిర్ణయించే అవకాశం లభిస్తుందని తహసీల్దార్ నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం బీఎల్‌ఓలు, సచివాలయం, రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు.





మడకశిర: మాట్లాడుతున్న తహసీల్దార్ ముర్షావలి

పరిగి: ప్రత్యేక ఓటరు నమోదుకై ఫారం 6, సవరణ కోసం ఫారం 8, ఆధార్ అనుసంధానంకోసం ఫారం– 8బి, అనర్హుల ఓట్ల తొలగింపునకు ఫారం –7 పై కొడిగెనహళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు తహసీల్దారు సౌజన్యలక్ష్మీ అవగాహన కల్పించారు. ఆదివారం కూడా జాబితాలో పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహం, హెచ్‌ఎం కృపా సత్యరాజు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: స్థానిక డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు ఓటు హక్కుపై తహసీల్దార్ సురేష్ అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కేశవరావ్, ఎంపీడీఓ శివశంకరప్ప, ఈఓఆర్డీ శ్రీదేవి, ఎంఈఓ చంద్రశేఖర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ హనుమంతు పాల్గొన్నారు.



అగళిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ జమానుల్లాఖాన్



గోరంట్లలో అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ తహసీల్దార్



చిలమత్తూరులో ఓటు హక్కుపై ర్యాలీ





పరిగిలో మాట్లాడుతున్న తహసీల్దారు సౌజన్యలక్ష్మీ

### మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఘన స్వాగతం



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ రూరల్: మడకశిరలో ఈనెల 7న జగర గబోవు సామాజిక సాధికార బస్సు యాత్ర కార్యక్రమాలను పరిశీలించేందుకు శనివారం సత్యసాయి జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఎమ్మెల్యే శంకరనారాయణ ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి అనంతపురం నుంచి మడకశిర వెళ్తుండగా పెనుకొండలో ఎమ్మెల్యే స్వాగతం పలికారు. అనంతరం తన ఇంటిలో మంత్రికి తేనీటి విందు ఇచ్చారు. ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నగరపంచాయతీ చైర్మన్ ఫరూఖ్, వైశాలి జయశంకరరెడ్డి, బాబు పాల్గొన్నారు.

### కుల గణనపై 6న సెమినార్

హిందూపురం: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు ప్రతిష్టాత్మకంగా కుల గణన సర్వే నిర్వహించడానికి ఆదేశాలు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. కుల గణన–2023పై ఈనెల 6వ తేదీన ఉదయం 10గంటలకు కౌన్సిల్‌హాల్‌లో రౌండ్ టేబుల్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్‌తోపాటు ప్రజాప్రతినిధులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, మైనార్టీ కుల సంఘ పెద్దలు హాజరవుతారన్నారు. మున్సిపల్ ఆఫీసు వద్ద నుంచి ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

## ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

పెనుకొండ రూరల్: మునిమడుగు పంచాయతీ చిన్నపరెడ్డిపల్లి గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహప్రతిష్ఠ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. మూడు రోజుల పాటు మహాగణపతి పూజ, కలశస్థాపన, నవగ్రహ హోమాలు, పూర్ణాహుతి, అభిషేకాలు, హోమాలు విశేష పూజలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున వేదపండితులు వేదమంత్రోచ్ఛారణల మధ్య శ్రీసీతారామ లక్ష్మణ సమేత, అభయాంజినేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర హాజరై పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం చేసింది. సభ్యులు ఏములేటి ప్రసాద్ రెడ్డి, రాము, గోవిందు, వెంకటేష్, నాయకులు వెంకటరెడ్డి, ఈరప్ప, సుదర్శన్, హరి పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ

### ‘ఆడుదాం ఆంధ్రా’కు పేర్లు నమోదు చేయించండి

రొళ్ల: ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా పోటీలపై ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఆజాద్ శనివారం సచివాలయాల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈనెల 13వరకు ‘ఆడుదాం ఆంధ్రా’ కోసం రిజిస్ట్రేషన్లు చేసుకొనేందుకు అవకాశం ఉందని, ఈ విషయంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు. వలంటీర్లతో వేగంగా రిజిస్ట్రేషన్లు చేయించాలన్నారు. ఈఓఆర్డీ క్రిష్టప్ప పాల్గొన్నారు.

అమరాపురం: ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం క్రీడా కిట్లను సరాఫరా చేసింది. శనివారం ఎంపీడీఓ కార్యాలయానికి అందిన కిట్లను ఎంపీపీ ఈరన్న, ఎంపీడీఓ మునిస్వామి, ఎంపీటీసీలు పరిశీలించారు. యువతీ యువకులు పోటీల్లో పాల్గొనేలా అవగాహన కల్పించాలని ఎంపీపీ అధికారులకు సూచించారు.

### ఆపద్బంధు 108 వాహనం



108 వాహనంలో రికార్డులను పరిశీలిస్తున్న డివిజన్ సూపర్‌వైజర్ రవీంద్ర

మడకశిర రూరల్: ఆపదలో ఉన్నవారికి 108 వాహనం ఆపద్బంధుగా మారింది. నవంబర్ నెలలో నియోజకవర్గ వ్యాప్తంగా 719 మంది 108 సేవలను ఉపయోగించుకున్నారని హిందూపురం డివిజన్ 108 సూపర్‌వైజర్ రవీంద్ర అన్నారు. ఆయన శనివారం మడకశిరలో పర్యటించి 108 వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

### డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

మడకశిర: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సెబ్ సీఐ భార్గవ్‌రెడ్డి, సీఐ సురేష్‌బాబు, ఎస్‌ఐ లోకేష్ సూచించారు. పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో శనివారం విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంతో తలెత్తే అనర్థాలపై అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పుట్టకామప్ప, కౌన్సిలర్ నాగేంద్ర, డ్రైవర్లు పాల్గొన్నారు.

### మాతృ భాషతోనే సత్సంబంధాలు

పావగడ: మాతృ భాష తోనే ప్రజల మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయని తుమకూరు జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కేఎస్ సిద్దలింగప్ప అన్నారు. స్థానిక వైఈఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన కన్నడ రాజ్యోత్సవ మాసాచరణ కన్నడ జాగృతి కార్యక్రమాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి పాల్గొన్నారు.

### రేపు మల్లినమడుగులో ‘వై ఏపీ నీడ్స్ జగన్’

రొళ్ల: మల్లినమడుగులో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ శారదమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర, యంజారప్ప తెలిపారు ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరవుతారన్నారు.

### నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాలు

- హాజరు కానున్న మడకశిర నియోజకవర్గ పరిశీలకులు అశోక్‌కుమార్, ఎమ్మెల్యే తిప్పేస్వామి

గుడిబండ/ రొళ్ల/అమరాపురం: గుడిబండ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఉదయ 11గంటలకు జరిగే పార్టీ కార్యకర్తల సమావేశానికి వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ పరిశీలకుడు పోకుల అశోక్‌కుమార్, ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరు కానున్నారు. ఈమేరకు మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు, జేసీఎస్ మండల కన్వీనర్ శివకుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. అదేవిధంగా రొళ్లలోని లక్ష్మీనరసింహస్వామి కమ్యూనిటీ భవనంలో ఆదివారం 1గంటకు జరిగే సమావేశానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి, అశోక్‌కుమార్ హాజరు కానున్నట్లు మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర తెలిపారు. అదేవిధంగా అమరాపురం ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు మండల వైఎస్సార్‌సీపీ సమావేశం ఏర్పాటు చేసినట్లు కన్వీనర్ త్రిలోక్‌నాథ్ తెలిపారు. పోకుల అశోక్‌కుమార్ విచ్చేయనున్నట్లు తెలిపారు.

### జూలకుంట గ్రామంలో పల్లెనిద్ర

సోమందేపల్లి: జూలకుంట గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. వార్డుల్లో తిరిగి సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఎంతో అవసరమని కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం గ్రామస్తులకు వివరించారు. సర్పంచ్ సోము, సింగిల్‌విండో చైర్మన్ ఆదినారాయణ రెడ్డి, ఇమామ్‌వలి పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించండి

మడకశిర రూరల్: స్థానిక కోర్టు హాల్‌లో ఈనెల 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని జూనియర్ సివిల్ జడ్జి ఆర్.అశోక్‌కుమార్ సూచించారు. స్థానిక కోర్టు హాల్‌లో జడ్జి శనివారం సీఐలు, ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించారు. రాజీకి అవకాశం ఉన్న కేసులు లోక్ అదాలత్‌కు వచ్చేలా చూడాలన్నారు. పెండింగ్ కేసులున్నవారు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలకు లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలన్నారు.



సీఐలు, ఎస్‌ఐలతో చర్చిస్తున్న జడ్జి ఆర్.అశోక్‌కుమార్

హిందూపురం అర్బన్: పోలీసులు తమస్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు జూనియర్ సివిల్‌జడ్జి రాజ్యలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో ఈ నెల 9న జరిగే మెగా లోక్ అదాలత్‌పై సీఐలు, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలతో సమీక్షించారు. లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకోతగ్గ కేసులపై దృష్టి పెట్టాలన్నారు. ఎక్సైజ్ సీఐ సువర్ణలత, హిందూపురం లేపాక్షి, చిలమత్తూరు, పరిగి ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## ఓటరు నమోదుకు అనూహ్య స్పందన

రొళ్ల: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా 32 బూత్ కేంద్రాల ఆవరణలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. హొట్టేబెట్ట, కొత్తపాళ్యం, రొళ్ల తదితర బూత్ కేంద్రాలను తహసీల్దార్ హసీనాసుల్తానా హాజరై పర్యవేక్షించారు. ఫారం –6 సంబంధించి కొత్తగా 88, ఫారం–8 సంబంధించి 14 మొత్తం 102 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఆదివారం కూడా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లేపాక్షి: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరిగింది. ఫారం–6కు 52 దరఖాస్తులు, ఫారం–7కు రెండు, ఫారం–8కు 5 దరఖాస్తులు అందినట్టు తహసీల్దార్ బాబు పేర్కొన్నారు.



రొళ్ల: కొత్తపాళ్యంలో ఓటరు నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ హసీనాసుల్తానా

మడకశిర రూరల్: కదిరేపల్లి పంచాయతీలో బూత్ స్థాయిలో జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ ముర్షావలి శనివారం పరిశీలించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ బాలాంజినేయులు గొడనహళ్లి పంచాయతీలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.

### నేడు కనకదాస విగ్రహావిష్కరణ

పరిగి: మండలంలోని విట్టాపల్లిలో కురుబల ఆరాధ్యదైవం భక్త కనకదాస విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హాజరవుతున్నారని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నరసింహమూర్తి, విట్టాపల్లి గ్రామ సచివాలయ కన్వీనర్ సతీష్‌కుమార్(బాబు) తెలిపారు.

## సంక్షిప్త సమాచారం

**గ్రామాల అభివృద్ధే లక్ష్యం**

సోమందేపల్లి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని నాగినాయని చెరువుతండాలో శనివారం ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఎల్పీఓ శివకుమార్, సర్పంచ్ అంజినాక్, ఎంపీడీఓ వెంకేటశ్వర్లు, ఈఓఆర్డీ నాగరాజు రావు, బీజేపీ నేత సోము పాల్గొన్నారు.

**బైకిస్టుకు గాయాలు**

చిలమత్తూరు: సోమఘట్ట వద్ద లారీ ఢీకొని అదే గ్రామానికి చెందిన బైకిస్టు వెంకటేష్ గాయపడ్డాడు. బాధితుడిని బాగేపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు.

**వృద్ధుడిపై దాడి**

చిలమత్తూరు: మద్యం జోలికి వెళ్లవద్దన్నందుకు దేమకేతేపల్లి గ్రామానికి చెందిన నారాయణప్ప(65) అనే వృద్ధుడిపై అదే గ్రామానికి చెందిన అతని మేనల్లుడు నగేష్, ఆయన భార్య సుకన్య దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుతో నగేష్, సుకన్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు.

**నేడు సేంద్రియ ఉత్పత్తుల మేళా**

హిందూపురం టౌన్: ధరణి వ్యవసాయ, మార్కెటింగ్ పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్, టింబక్టు ఆర్గానిక్ ఆధ్వర్యంలో మణిశరణ్ మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో స్థానిక రాజధాని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సేంద్రియ ఉత్పత్తుల, వంటల మేళా నిర్వహించనున్నారు.

**గుండెపోటుతో స్వర్ణకారుడి మృతి**

హిందూపురం: చౌళూరు గ్రామానికి చెందిన రామాంజి (30) హఠాన్మరణం చెందాడు. పట్టణంలో స్వర్ణకారుడిగా పనిచేస్తున్న ఈయన శనివారం బైక్‌లో వెళ్తుండగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఛాతీలో నొప్పి వచ్చింది. బైక్‌ను పార్క్‌చేసి కుప్పకూలాడు. స్థానికులు గమనించగా అప్పటికే ఆయన మృతి చెందాడు. పోలీసులు అతనిది సహజమరణమని నిర్ధారించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

**యూటీఎఫ్ మండల శాఖ కార్యవర్గం**

గోరంట్ల: స్థానిక ప్రాథమిక పాఠశాలలో శనివారం మండల యూటీఎఫ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా మురళి, ప్రధాన కార్యదర్శిగా టీ నాగేష్, గౌరవాధ్యక్షుడిగా టీ కిష్టప్ప, ఉపాధ్యక్షులుగా వేణుగోపాల్, నాగమణి, కోశాధికారిగా రామకృష్ణను ఎన్నుకున్నారు.

**పేట వేంకటరమణ స్వామికి విశేష పూజలు**



విశేష అలంకరణలో పేటవెంకటరమణస్వామి



శనీశ్వరస్వామిని మొక్కుకుంటున్న భక్తులు

హిందూపురం: కార్తీక మాసం సందర్భంగా పేట వేంకటరమణ స్వామి, డీబీ కాలనీలో వెలసిన శనేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేంకటరమణ స్వామికి ప్రాకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సూగురు ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి విశేష అలంకరణతో అర్చనలు, పూజలు నిర్వహించారు. భక్తులు హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పావగడ: పట్టణంలోని శనీశ్వరాలయంలో శనివారోత్సవ పూజలు శనివారం వైభవంగా జరిగాయి.

**ఫలించిన కార్మికుల పోరాటం**

హిందూపురం అర్బన్: తూమకుంట పారిశ్రామిక వాడలోని గురునానక్ పరిశ్రమ కార్మికులు చేస్తున్న పోరాటం ఫలించింది. యజమాని అవతార్ సింగ్ శనివారం కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్ చేతుల మీదుగా కార్మికులకు రూ.9 లక్షల గ్రాట్యుటీని అందజేశారు.

**సంఘాలను బలోపేతం చేయండి**

అమరాపురం: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శనివారం వీఓఏలతో మడకశిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏరియా కో ఆర్డినేటర్ నాగరాజు సమావేశమయ్యారు. మహిళా సంఘాల బలోపేతం, పొదుపు, రుణాల రికవరీపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు.

**స్వర్ణోత్సవ మహాసభ పోస్టర్ల విడుదల**

మడకశిర: హిందూపురంలో నిర్వహించనున్న యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవాల మహాసభలకు సంబంధించి పట్టణంలోని ఎంపీపీఎస్(కేఎస్)లో మండల అధ్యక్షుడు మహాలింగప్ప శనివారం పోస్టర్లు విడుదల చేశారు. ప్రధాన కార్యదర్శి జోగప్ప మూడ్లగిరియప్ప, నరసింహమూర్తి, సుదర్శన్, మహంతేష్, దేవరాజు, నంజప్ప, కదరన్న, సూర్యప్రకాష్, నరసింహరాజు, ఉగ్రనరసింహ పాల్గొన్నారు.

**ఉపాధి హామీ పనులపై ప్రజా వేదిక**

పరిగి: మండలంలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వరకూ జరిగిన ఉపాధి హామీ పనులు, పంచాయతీ రాజ్ అభివృద్ధి పనులు, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎస్ఏ పనులపై పరిగిలో శనివారం సామాజిక ప్రజావేదిక ఏర్పాటు చేశారు. ఎంపీపీ సవిత, డ్వామా పీడీ విజయప్రసాద్ హాజరయ్యారు. మొత్తం 6,74,47,028తో పనులు జరగ్గా కేవలం రూ.22 వేలు అవకతవకలు జరిగినట్లు గుర్తించామన్నారు. జెడ్పీటీసీ శ్రీరామప్ప, ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీఓ సరస్వతి, ఏపీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చిలమత్తూరు: మండలంలో 2022–23 సంవత్సరాల్లో ఉపాధి హామీ కింద రూ.6.54 కోట్లతో జరిగిన పనులపై శనివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఓపెన్ ఫోరం నిర్వహించారు. పీడీ విజయ్ ప్రసాద్ పాల్గొన్నారు. రూ.29,657 అవినీతి జరిగినట్టు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ తెలిపారు. టేకులోడు పంచాయతీలో లేని మొక్కలకు బిల్లులు పెట్టినట్టుగా వెల్లడైందన్నారు.ఏపీడీ శివానందనాయక్, ఏపీఓ సూర్యనారాయణ పాల్గొన్నారు.

**ఘనంగా టిప్పు జయంతి**

అమరాపురం: అమరాపురంలో ముస్లిం సముదాయ ప్రజలు శనివారం టిప్పుసుల్తాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. టిప్పుసుల్తాన్ చిత్రపటాన్ని ఊరేగించారు.